




# మనం

MANAM

చిత్తూరు । తిరుపతి

గురువారం 18 జూన్ 2026

4 పేజీలు





## తిరుచానూరు అమ్మవారి ఆలయంలో వైభవంగా ఆర్జిత సేవలు



- శ్రీ పద్మావతి అమ్మవారి సేవలతో భక్తులకు ఐశ్వర్యం – ఆధ్యాత్మిక ప్రశాంతత.
- సంప్రదాయ వస్త్రధారణతో సేవల్లో పాల్గొనాలని టీటీడీ సూచన

తిరుచానూరు,జూన్ 17,మనం న్యూస్: కలియుగంలో భక్తుల కోరికలను కరుణతో తీర్చే సిరుల తల్లి శ్రీ పద్మావతి అమ్మవారి అనుగ్రహంతో భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక ప్రశాంతత కలగాలని సంకల్పిస్తూ తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నిత్యం ఆర్జిత సేవలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానాల ప్రకారం జరుగుతున్న ఈ సేవల్లో దేశ విదేశాల నుండి వేలాదిమంది భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులవుతున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నిత్య, వారాంత, నెలవారీ, వార్షిక, శాశ్వత ఆర్జిత సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారికి సమర్పించే ప్రతి సేవ భక్తులలో భక్తి భావనను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక ఆనందాన్ని 2లో



ప్రజా సంక్షేమం కోరి కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న

# సంస్కరణలను ప్రజలకు తెలియజేద్దాం

## మెగా డీఎస్సీ పై చేస్తున్న ఆరోపణలను తిప్పి కొడదాం

- కుప్పం సంక్షేమ విజయోత్సభలో కూటమి శ్రేణులకు పిలుపునిచ్చిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

కుప్పం జూన్ 17 మనం న్యూస్: ప్రజా సంక్షేమాన్ని కోరి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలను ప్రజలకు తెలియజేసి, 2029 సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి ఎన్ డి ఏ సర్కార్ ను అధికారంలోకి తెచ్చుకునేందుకు మన మంతా ఐక్యంగా పనిచేద్దామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కూటమి నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.అదేసమయంలో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన 2025 మెగా డీఎస్సీ పై వైకాపా చేస్తున్న విమర్శలను తిప్పుకొట్టాలని ఆయన సూచించారు. బుధవారం కుప్పం ఏపీఎస్ఆర్టీసీ సమీపంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు సంబంధించి, సంక్షేమ విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ విజయోత్సవ సభ కార్యక్రమానికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ముందుగా ఆయన , ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పికేయం హుడా చైర్మన్ డాక్టర్ సురేష్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మహిళా నేతలు,కుప్పం నియోజకవర్గానికి సంబంధించిన కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పుష్పాలు సమర్పించి ఘన నివాళులర్పించారు. జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, రెండేళ్ల విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా టిటిడి, బిజేపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు ఆయన ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు.అభివృద్ధి, సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తున్న సూపర్ సిక్స్ పథకాల అమలలో కూటమి ప్రభుత్వం సక్సెస్ను సాధించిందని కొనియాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేనంత అభివృద్ధిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు సంయుక్త నిర్వహణలో చేసి చూపారని, వారి కృషిని ప్రశంసించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయడంలో మనం వెనుకబడి ఉన్నామని చెప్పిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు..,దీన్ని అధిగమించే దిశగా మనమంతా ఐక్యంగా పనిచేస్తూ.., సంక్షేమాన్ని అభివృద్ధిని క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయడమే ప్రథమ కర్తవ్యంగా ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు.అప్పుడే మన కష్టానికి ఫలితం దొరుకుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మంచి పనులను ప్రజలకు చేరువ చేయడం ద్వారా విపక్షాల విమర్శలకు చెక్ పెట్టవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు.అనంతరం ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పికేయం హుడా చైర్మన్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ... తమ మనుగడ కోసమే వైకాపా పనిచేసే ప్రభుత్వం పై బురదచల్లుతోందని దుయ్యబట్టారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా 2లో

## తిరుమల కొండపై హెలికాప్టర్ కలకలం.. ఆలయం పైన చక్కర్లు



తిరుమల, జూన్ 17,మనం న్యూస్ :తిరుమల కొండపై మరోసారి హెలికాప్టర్ వెళ్లడంతో కలకలం రేగింది. ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం తిరుమల శ్రీవారి ఆలయంపై ఎలాంటి విమానాలు.. హెలికాప్టర్లు ప్రయాణించకూదు.అలా వెళ్లడం వలన ఆలయ పవిత్రత దెబ్బతింటుంది. బుధవారం ఉదయం శ్రీవారి ఆలయంపై ఓ హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. తిరుమలను నో ఫ్లైయింగ్ జోన్ గా ప్రకటించాలని అనేక మార్లు కోరన కేంద్ర విమానయాన శాఖను టీటీడీ కోరింది. ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి టీటీడీ గతంలోనే లేఖ రాసింది. త్వరలో ఈ విషయంపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి పౌర విమానయానశాఖ నిర్ణయం తీసుకోనుంది.శ్రీవారి ఆలయ పవిత్రతను పరిరక్షించేందుకు మరింత కఠిన నియంత్రణలు అమలు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## రామకుప్పం గురుకుల పాఠశాల దుస్థితి బాధ్యుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని విన్నపం



రామకుప్పం గురుకుల పాఠశాల ప్రస్తుతం అత్యంత దయనీయ స్థితికి చేరుకుంది. ఒకప్పుడు రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచిన ఈ విద్యాసంస్థ, ప్రస్తుతం అస్తవ్యస్తమైన పాలనతో పతనమైంది. ముఖ్యంగా పాఠశాలలోని కొంతమంది సిబ్బందిప్రవర్తన బాధ్యతారాహిత్యం పాఠశాల అధోగతికి ప్రధాన కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**విద్యార్థుల భవితతో చెలగాటం:**

పాఠశాలలోని విద్యార్థులు గంజాయి, మత్తుపదార్థాలు, హాన్స్ వంటి అలవాట్లకు బానిసలవుతున్నారు.. పాఠశాల ప్రాంగణంలోనే ఇటువంటి పదార్థాలు లభ్యం కావడమే కాకుండా, విద్యార్థులు జూదం వంటి అలవాట్లకు అలవాటు పడుతున్నారు. తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు ఇలాంటి దురలవాట్లకు లోనవుతుంటే, యాజమాన్యం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది.

**పనిమనిషులుగా విద్యార్థులు:**

విద్యాబోధన చేయాల్సిన గురువులు పర్యవేక్షించాల్సింది పోయి, విద్యార్థులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. గ్యాస్ సిలిండర్లు మోయించడం వంటి పనులను విద్యార్థులతో చేయిస్తూ, వాz విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారు.

**దారుణమైన విద్యా ప్రమాణాలు:**

పాఠశాల పది ఫలితాలు కేవలం 28%కి పడిపోయాయి. కనీసం ఒక్క విద్యార్థి కూడా 500 మార్కులు సాధించలేకపోయారంటే, అక్కడ బోధన ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పుతలపట్టు గురుకుల పాఠశాల 80 మందిలో 41 మంది 500కు పైగా మార్కులు సాధిస్తుంటే, రామకుప్పం పాఠశాల వైఫల్యం అధికారుల అలసత్వానికి నిదర్శనం.

**ప్రిన్సిపల్ మరియు సిబ్బంది బాధ్యతారాహిత్యం :**

పాఠశాలలో పని చేస్తున్న సుమారు 20 మంది టీచింగ్ సిబ్బంది ఉన్నప్పటికీ, ఫలితాలు ఇంత దారుణంగా ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రిన్సిపల్ బాధ్యతారాహిత్యం, విద్యాబోధన కంటే సోషల్ మీడియా (ఇన్‌స్టాగ్రామ్) పట్ల చూపిస్తున్న ఆసక్తి విద్యార్థుల పాలిట శాపంగా మారింది. పైన పేర్కొన్న సిబ్బంది పాఠశాల పతనం వెనుక కీలక పాత్ర పోషిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

# విద్యార్థినులకు మెరుగైన వసతులు,నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



నాయుడుపేట జూన్17 మనంన్యూస్: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థినులకు మెరుగైన వసతులు,నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అన్నారు.నాయుడుపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వసతి గృహంలోని మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, విద్యార్థినులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్ల మరమ్మత్తులు, నిరంతర తాగునీటి సరఫరా,ప్రతి కొళాయికి ట్యాపుల ఏర్పాటు, ట్యూబ్‌లైట్లు,ఎలక్ట్రికల్ వైరింగ్, ఎల్ఈడీ బల్బుల అమరిక, వంటగదిలో ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఏర్పాటు,స్టోర్‌రూమ్‌కు మెష్ ఏర్పాటు,కిటికీలకు దోమల నివారణ మెష్‌లు,తలుపుల మరమ్మత్తులు,గదుల్లో లీకేజీల నివారణ,ఫ్లోరింగ్ పనులు,ఆర్ఓ త్రాగునీటి ప్లాంట్ వంటి అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థినులకు నాణ్యమైన, పోషకాహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వసతి గృహ అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడి హాస్టల్‌లో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అందరూ క్రమశిక్షణతో చదువుకొని మంచి ఫలితాలు సాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థిను లను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు,గురుకుల విద్యా సంస్థల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కనీస మౌలిక వసతుల కల్పన, మరమ్మత్తు పనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించిన నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా వినియోగించి నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.నిర్మాణ,మరమ్మత్తు పను ల్లో నాసిరకం మెటీరియల్‌ను ఉపయోగించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి హరీష్, నాయుడుపేట తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ పజిలుల్లా,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం,అసిస్టెంట్ సాంఘిక సంక్షేమ అధికారిణి లక్ష్మీరాజ్యం,వార్డెన్లు సరిత,ఉమ, సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీహార్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి 15 ఎకరాల భూమి కేటాయింపు



- బీహార్ ప్రభుత్వానికి టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు కృతజ్ఞతలు

తిరుపతి(టిటిడి), జూన్ 17,మనం న్యూస్:ఉత్తర భారత దేశంలో సనాతన ధర్మ ప్రచారానికి, శ్రీవారి భక్తులకు ఆధ్యాత్మిక సేవలను మరింత చేరువ చేయడానికి మరో కీలక అడుగు పడింది. బీహార్ రాజధాని పాట్నా సమీపంలో గంగా నది తీరానికి దగ్గరగా, జాతీయ రహదారి పక్కన శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం బీహార్ ప్రభుత్వం 15 ఎకరాల భూమిని కేటాయించింది.ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి, శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో బీహార్ చీఫ్ సెక్రటరీ అమృత్ ప్రత్యయ్ పాల్గొన్నారు.ప్రతిపాదిత ఆలయ ప్రాంగణంలో ప్రధాన దేవాలయంతో పాటు కళ్యాణ మండపం, పుష్కరిణి, యాత్రికుల సౌకర్యాలకు అవసరమైన ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు.దేశంలోని వివిధ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం ద్వారా సనాతన ధర్మ ప్రచారాన్ని విస్తరించాలనే లక్ష్యంతో టీటీడీ ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో అన్ని రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయాలను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో కార్యాచరణ కొనసాగుతోంది.ఇప్పటికే అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం 10 ఎకరాల భూమి కేటాయింపు పూర్తికాగా, ఇప్పుడు బీహార్‌లోని పాట్నా సమీపంలో ఆలయ నిర్మాణానికి భూమి కేటాయించడం విశేషం.ఉత్తర భారత భక్తులకు తిరుమల శ్రీవారితో అనుబంధాన్ని మరింత పెంచడంతో పాటు, ఈ ఆలయం భవిష్యత్తులో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు టీటీడీ ప్రణాళికలు రూపొందిస్తోంది.



## చంద్రగిరి కోటలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్

- ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఉత్తమ మార్గము: జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు

చంద్రగిరి జూన్ 17 మనం న్యూస్: ఆరోగ్యవంతమైన జీవితానికి యోగ ఉత్తమ మార్గమని ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో యోగా ను భాగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహా యాదవ్ లు తెలిపారు. బుధవారం తిరుపతి జిల్లా పరిధి లోని చంద్రగిరి కోటలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర -2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటకశాఖ ఆధర్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా 2లో

## 19న దామల చెరువులో రైతు గర్జన

- తోతాపురికి 18రూపాయలు గిట్టుబాటు కల్పించాల్సిందే
- ర్యాంపు ల్లో ప్రభుత్వ పర్యవేక్షణ తో కొనుగోలు చేయాలి



పాకాల జూన్ 17 మనం న్యూస్: పాకాల మండలం మంగళంపేట లో జరిగిన మామిడి రైతు సమావేశం లో రైతు సంఘ నేతలుఎ.రామానాయుడు,డా. టి.జనార్దన్.తోతాపురి మామిడి రైతులను ఆదుకోవడం లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైనందున రైతులు ఉధ్యమబాట పట్టనున్నారు. పోరాట క్రమంలో భాగంగా ఈనెల 19 న శుక్రవారం దామల్ చెరువు లో రైతుఘర్జన కార్యక్రమం చేపట్ట నున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. రామానాయుడు,, మామిడి రైతు సంఘ నేత డా.టి. జనార్దన్,, జి మునిరత్నం లు పేర్కొన్నారు. బుధవారం పులిచెర్ల మండలం మంగళంపేట, మద్దేవారిపల్లె, కొమ్మిరెడ్డిగారిపల్లె, కొత్తపేట, పోశంవారి పల్లె, గ్రామాలలో రెతుసంఘం, నేతలు,, ,, బెల్లంకొండ శ్రీనివాస్,, శివారెడ్డిల తో కలసి పర్యటించి మామిడి రైతుల సమస్యలు తెలుసు కొన్నారు..అనంతరం మంగళంపేట లో గ్రామ మాజీ సర్పంచ్ , రైతు నాయకుడు మధు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం ప్రభుత్వం రైతు సంఘ నేతలతో సమావేశం నిర్వహించి తోతాపురికి ధర నిర్ణయించగా ఈ సంవత్సరం పూర్తిగా రైతులను, రైతుసంఘాలను విస్మరించి ఏకపక్షంగా నామమాత్రం ధరప్రకటించడం దుర్మార్గం అన్నారు..తోతాపురి దిగుబడి గత సంవత్సరం కన్నా తగ్గిన నేపథ్యంలో ఈసంవత్సరం కిలోకు రూ18 ( ఫ్యాక్టరీ 12+6 ప్రభుత్వ ప్రోత్సాహకం) చొప్పునా అందజేయాలని లేనిచో రైతు తీవ్రంగా నష్టపోతారని వారు పేర్కొన్నారు.ర్యాంపుల్లో సైతం ప్రభుత్వ ధరలకు భిన్నంగా కిలోకు రూ3,4 కు కొనుగోలు చేస్తుంటే అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని దుయ్యబట్టారు. ర్యాంపు నిర్వాహకులు పల్ప్ యజమానులతో కుమ్మక్కై ధరలు తగ్గించి రైతులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. కోతకు పర్మిట్లు మంజూరు లో తీవ్రంగా అవకతవకలు 2లో

## సంస్కరణలను ప్రజలకు తెలియజేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తుందని చెప్పారు. ఇది వైసిపి నాయకులకు కనపడలేదా అంటూ.. ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేసిందని, అందుకే ఇప్పుడు తాము సంక్షేమ విజయోత్సవ సభలను నిర్వహిస్తూ.., ప్రజలను భాగస్వామ్యం చేస్తూ, ఇంకా వారికి ఏమి కావాలో అడుగుతున్నామని చెప్పారు. ఇదే ప్రజా పాలనకు నిదర్శనం అన్నారు. ప్రజా సేవకులు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అని, ఆయన నాయకత్వాన్ని ప్రజలు మళ్ళీ కోరుకుంటున్నారని వారు తెలియజేశారు.ఈ విజయోత్సవ సభా కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, రెస్కో చైర్మన్ ప్రతాప్, కడ అడ్వైజర్ మెంబర్ రాజ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## తిరుచానూరు అమ్మవారి ఆలయంలో వైభవంగా ఆర్జిత సేవలు

(మొదటి పేజీ తరువాయి)

కలిగిస్తోంది.నిత్య సేవలుప్రతిరోజూ ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ నిర్వహిస్తారు. శుక్రవారం మాత్రం ఉదయం 3.30 గంటలకు ఈ సేవ జరుగుతుంది. ఉదయం 5 గంటలకు సహస్రనామార్చన నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 4 గంటలకు ఈ సేవ ఉంటుంది.ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు.మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు కుంకుమార్చన సేవ నిర్వహిస్తారు.సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు సహస్ర దీపాలంకార సేవ జరుగుతుంది.ప్రతిరోజూ రాత్రి 9.30 గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తారు. శుక్రవారం మాత్రం రాత్రి 9.45 గంటలకు ఈ సేవ ఉంటుంది.ఆలయంలోని వేదాశీర్వచన మండపంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వేదాశీర్వచనం కార్యక్రమం నిర్వహిస్తారు.ప్రతిరోజూ ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వి.ఐ.పి. బ్రేక్ దర్శనం ఉంటుంది.వారాంతపు సేవలుప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు అష్టదళ పాదపద్మారాధన సేవ నిర్వహిస్తారు.ప్రతి గురువారం ఉదయం 7 గంటలకు తిరుప్పావడ సేవ జరుగుతుంది.ప్రతి శుక్రవారం ఉదయం 5.30 గంటలకు వస్త్రాలంకరణ సేవ, అనంతరం అభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 7 గంటలకు అభిషేకానంతర దర్శనం కల్పిస్తారు.అదే రోజు ఉదయం 9.30 గంటలకు లక్ష్మీపూజ నిర్వహిస్తారు.ప్రతి శనివారం ఉదయం 7.30 గంటలకు పుష్పాంజలి సేవ జరుగుతుంది.నెలవారీ సేవలుప్రతి నెల మొదటి బుధవారం ఉదయం 7 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు.వార్షిక సేవలుప్రతి ఏడాది మే నెలలో వార్షిక వసంతోత్సవాలు, సెప్టెంబర్ నెలలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు.నవంబర్ నెలలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ రోజున లక్ష కుంకుమార్చన, మరుసటి రోజు పుష్పయాగం వైభవంగా జరుగుతాయి.ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలలో వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తారు.శాశ్వత సేవలుశాశ్వత సేవలలో భాగంగా నిత్య అర్చన, ఊంజల్ సేవలను భక్తులు కోరిన రోజున నిర్వహించి ఇద్దరికి దర్శన భాగ్యం కల్పిస్తారు.అదేవిధంగా శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ శ్రీనివాస స్వామివారి ఆలయంలో ప్రతి శనివారం ఉదయం, అలాగే శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ప్రతి ఆదివారం ఉదయం అభిషేక సేవలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.ఆర్జిత సేవల టికెట్లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లో ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా కూడా సేవా టికెట్లు పొందవచ్చు. ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో, సేవ సమయానికి ముందుగానే ఆలయానికి చేరుకొని టీటీడీ నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు.భక్తులు అమ్మవారి సేవల్లో పాల్గొని దైవానుగ్రహాన్ని పొందాలని కోరడమైనది.

## 19న దామల చెరువులో రైతు గర్జన

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయని,ఫలితం గా కాయలు కుళ్ళిపోతున్నాయని, రాజకీయ జోక్యం మాని క్రమపద్ధతి పాటించాలని వారు కోరారు. అలాగే గత సంవత్సరం రైతులకు చెల్లించాల్సిన ₹250 కోట్ల (ర్యాంపు మరియూ ఫ్యాక్టరీ లనుండి )బకాయిలు సత్వరం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. మామిడికి ప్రభుత్వ ప్రోత్సాహంగా ధరల స్థిరీకరణ నిధి నుండి అధికారికంగా ₹250 కోట్లు విడుదల చేసి కిలోకు ₹6 చొప్పున ప్రోత్సాహకం అందజేసి ఆదుకోవాలని కోరారు.మామిడి రైతులను ఆదుకోవడంలో విఫలమైతే రైతాంగ ఉద్యమం చవి చూడాల్సి వస్తుందని తెలిపారు.ఈ నెల 19 న ఉదయం 10 గంటలకు దామల చెరువు లో జరిగే రైతు గర్జనకు పెద్ద ఎత్తున మామిడి రైతులు హాజరు కావాలని వారు కోరారు.ఈ కార్యక్రమం లో రైతు నాయకులు, ఎస్. మురవత్ భాషా,,ప్రభాకర్, నాగరాజు, మునుస్వామి,, వెంకటరత్నం నాయుడు,, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి కోటలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

పర్యాటక శాఖ అధికారి జనార్దన్ రెడ్డి,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నా ఈ కార్యక్రమంలో భాగంగా యోగా గురువు చెప్పిన విధంగా ఆసనాలు ఆసక్తిగా ఉంటూ ప్రజలు, అధికారులు ఆసనాలు వేయడం జరిగింది. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ జూన్ 21 వ తేదీన జరుపుకోవడం జరుగుతుందని అందులో భాగంగా జూన్ 7 వ తేదీ నుంచి జూన్ 21 వ తేదీ వరకు గ్రామ, సచివాలయ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో వివిధ రకాల పోటీలనునిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. జూన్ 7వ తేదీన జూ పార్కు నందు పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈరోజు చారిత్రాత్మక కట్టడమైన చంద్రగిరి కోట నందు యోగాంధ్ర కార్యక్రమాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. యోగ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలన్నారు.ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రతి ఒక్కరి ఆరోగ్యం కొరకు యోగా ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి యోగా కార్యక్రమం పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. జూన్ 21వ తేదీన జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్, ఎస్పీ ,ప్రజా ప్రతినిధులతో కలిసి పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమం ఉంటుందని, ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ మాట్లాడుతూ యోగా ఆరోగ్యానికి ఆరోగ్యకర జీవితానికి మంచిదన్నారు.ప్రతిరోజు యోగ సాధనలు చేయడం వల్ల ఉత్సాహం ఉల్లాసం తో ఉండటంతో పాటు మానవుడు ఆరోగ్యంగా జీవిస్తాడన్నారు.ఈ నెల 21న యోగా దినోత్సవం జిల్లాలో భారీ స్థాయిలో యోగా డే కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో నిర్వహించనున్నది అన్నారు.గత సంవత్సరం ప్రపంచమే నివ్వెరపోయే విధముగా విశాఖపట్నంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యోగ డే నిర్వహించి దేశానికి ఆంధ్రప్రదేశ్ ఒక దిక్సూచి అయిందన్నారు.అదేవిధంగా ఈసారి రాష్ట్రంలో ఎక్కడికక్కడ యోగ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై యోగాసనాలు నిర్వహించారు.

## పోలీసులచే దారుణంగా హత్యగావించిన సాయి కృష్ణ, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

● భూమన అభినయ్ రెడ్డి.




తిరుపతి,జూన్ 17,మనం న్యూస్:సాయికృష్ణ ఆచూకీ వెల్లడించాలని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు తిరుపతి వైసీపీ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక తల్లి ఆవేదనకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, నిజాలు వెలుగులోకి రావాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని కోరారు.ఒక తల్లి కన్నీటికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో వైసీపీకి చెందిన వివిధ విభాగాల కాపు నాయకులు పసుపులేటి సురేష్, దినేష్ రాయల్, వంశి, అనీష్ రాయల్, పద్మజ, విజయలక్ష్మి, శేఖర్ రాయల్, చిన్న ముని రాయల్,నాగేంద్ర రాయల్,ఆర్.వి.గిరి,వెంకటేష్ రాయల్ మరికొందరు నాయకులు పాల్గొన్నారు.

# తోతాపురి మామిడి రైతులకు పూర్తి భరోసా

● కిలోకు రూ.6 కంటే తక్కువ ధర చెల్లిస్తే కఠిన చర్యలు

● వర్ష ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి కొనుగోలు ప్రక్రియలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్



తిరుపతి, జూన్ 17,మనం న్యూస్:జిల్లాలో తోతాపురి మామిడి కొనుగోలు ప్రక్రియలు సజావుగా కొనసాగుతున్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డితో కలిసి రేణిగుంట మండలంలోని వర్ష ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించిన కలెక్టర్, కొనుగోలు ప్రక్రియలు, ధరల అమలు, రైతులకు అందుతున్న సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత ఏడాది అధిక దిగుబడి కారణంగా రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రైతులకు మద్దతు కల్పించిందన్నారు. ఈ ఏడాది మార్కెట్ పరిస్థితులు మెరుగ్గా ఉన్నప్పటికీ, రైతులకు కిలోకు రూ.6 కంటే తక్కువ ధర రాకుండా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.ఇటీవల తిరుపతి పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా రైతులతో సమావేశమై వారికి భరోసా కల్పించారని, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. రానున్న 10 నుండి 15 రోజులు తోతాపురి సీజన్‌లో అత్యంత కీలకమైన కాలమని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు పక్వానికి రాని కాయలను కోయకుండా, పూర్తిగా పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి విక్రయించాలని సూచించారు. పక్వానికి రాని కాయలను విక్రయించడం వల్ల రైతులకే నష్టం కలుగుతుందని వివరించారు. ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద రైతులు, రవాణా వాహనాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా టోకెన్ విధానాన్ని అమలు చేయాలని అన్ని యూనిట్లకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వర్ష ప్రాసెసింగ్ యూనిట్ ఇప్పటికే కోడూరు ప్రాంత రైతులకు ముందస్తుగా టోకెన్లు జారీ చేయడం వల్ల వాహనాల రద్దీ గణనీయంగా తగ్గిందన్నారు. ప్రస్తుతం యూనిట్‌కు చేరుకునే వాహనాలు గరిష్టంగా 6 నుండి 12 గంటల వ్యవధిలో ఖాళీ అయి తిరిగి వెళ్తున్నాయని, కొనుగోలు ప్రక్రియలు వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గత 10 రోజుల్లో వర్ష ప్రాసెసింగ్ యూనిట్ ఒక్కటే సుమారు 25 వేల టన్నులకు పైగా తోతాపురి మామిడిని కొనుగోలు చేసిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఇతర యూనిట్ల కొనుగోళ్లు కలిపి ఇప్పటివరకు సుమారు 80 వేల నుండి 90 వేల టన్నుల వరకు సేకరణ జరిగిందన్నారు. కోడూరు ప్రాంతంతో కలిపి ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 2.50 లక్షల టన్నుల తోతాపురి దిగుబడి నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.జిల్లాలో ఉత్పత్తి అయ్యే ప్రతి తోతాపురి మామిడి కాయను కొనుగోలు చేసేలా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో పీక్ సీజన్ కొనసాగనున్న నేపథ్యంలో రైతులు ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికావద్దని సూచించారు.కిలోకు రూ.6 కంటే తక్కువ ధర చెల్లించే యూనిట్లు ఎక్కడైనా ఉన్నట్లయితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట తహసిల్దార్ శ్రవణ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారులు, వర్ష ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### తిరుమల స్థానిక దుకాణాల యజమానులతో

# పోలీసు,టిటిడి విజిలెన్స్ అవగాహన సమావేశం

● భక్తులకు నాణ్యమైన సేవలు,ధరల ప్రదర్శన, అగ్నిమాపక భద్రత, సిబ్బంది ధృవీకరణపై పూర్తి సహకారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి.



తిరుమల,జూన్ 17,మనం న్యూస్: తిరుమలలో భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించడం, క్షేత్ర పవిత్రతను పరిరక్షించడం, శాంతిభద్రతలను బలోపేతం చేయడం మరియు వ్యాపార కార్యకలాపాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం లక్ష్యంగా పోలీసు, విజిలెన్స్ శాఖల ఆధ్వర్యంలో స్థానిక దుకాణాల యజమానులతో అవగాహన సమావేశం తిరుమల ఆస్థాన మండపంలో నిర్వహించబడింది.ఈ సమావే శం లో దుకాణాల యజమానులకు ధరల ప్రదర్శన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయడం, అనుమతి లేకుండా దుకాణాలను సబ్-లీజ్‌కు ఇవ్వకపోవడం, లైసెన్స్ లేని హాకర్లను ప్రోత్సహించకపోవడం, నిషేధిత లేదా అనుమతి లేని వస్తువుల విక్రయాన్ని నివారించడం, అగ్నిమాపక భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం, అనుమతించిన పరిమితికి మించి నిల్వలను ఉంచకపోవడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించబడింది.అదేవిధంగా, దుకాణాల్లో పనిచేసే సిబ్బంది పూర్తి వివరాలను సంబంధిత అధికారులకు నిరంతరం అందించడం, వారి నేపథ్యం మరియు నేర చరిత్రను పరిశీలించిన అనంతరం మాత్రమే నియామకాలు చేపట్టడం, ఎన్యుమరేషన్ డేటాను సకాలంలో సమర్పించడం, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం మరియు ఎటువంటి వివాదాస్పద పరిస్థితులకు తావు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి అంశాలపై స్పష్టమైన సూచనలు జారీ చేయబడ్డాయి.తిరుమల క్షేత్ర పవిత్రతకు, శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ గౌరవానికి మరియు భక్తుల మనోభావాలకు భంగం కలిగించే ఎటువంటి చర్యలకు పాల్పడబోమని, మత సామరస్యాన్ని పరిరక్షిస్తామని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసు, విజిలెన్స్ మరియు సెక్యూరిటీ అధికారులకు సమాచారం అందిస్తామని దుకాణాల యజమానులు హామీ ఇచ్చారు.అలాగే, పోలీసు, విజిలెన్స్ మరియు సెక్యూరిటీ శాఖలు నిర్వహించే తనిఖీలు, భద్రతా చర్యలు మరియు ఇతర అధికారిక కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని, సంబంధిత శాఖలు జారీ చేసే నిబంధనలు, ఆదేశాలు మరియు మార్గదర్శకాలను విధిగా అనుసరిస్తామని వారు పేర్కొన్నారు.ఈ సమావేశం తిరుమల డీఎస్పీ విజయశేఖర్, టీటీడీ వీజీవో సురేంద్ర నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది దుకాణాల యజమానులతో పాటు తిరుమల వన్ టౌన్, టూ టౌన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సెక్టార్-3 మరియు సెక్టార్-4 ఏవీఎస్‌వోలు, పోలీసు మరియు విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

### కాణిపాకం ఆలయఔట్సోర్సింగ్ ఉద్యోగుల

# జీతభత్యాలు పెంపుపై నిర్ణయం తీసుకుంటాం!

● వినాయక సదరన్ నందుసిబ్బంది కొరత లేకుండా చూస్తాం



పూతలపట్టు జూన్ 17 మనం న్యూస్:శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నందు పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తుల జీతాలపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని పాలకమండలి చైర్మన్ మణి నాయుడు ఆలయ ఈవో పెంచల కిషోర్ తెలిపారు. కాణిపాకం పాలకమండలి సమావేశం బుధవారంకార్య నిర్వహణ అధికారి కార్యాలయంలోఆలయ చైర్మన్ మణి నాయుడు, ఈవో పెంచల కిషోర్, ఆధ్వర్యంలో బుధవారం కానిపాకం నందు నిర్వహించారు ఇందులో భాగంగా వారు మాట్లాడుతూస్వామివారి దేవస్థానం కార్యనిర్వహణధికారి కార్యాలయం మీటింగ్ హాలు నంద చైర్మన్ మణి నాయుడు దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించడం జరిగింది, మొదటిగా దేవస్థానం నందు పనిచేయు ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులకు పెద్దపీట వేస్తూ బోర్డు నిర్ణయం, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తుల జీతభత్యాల పెంపు గురించి ఆమోదం తెలుపుత ఉద్యోగస్తుల సమస్యల గురించి తెలుసుకుని వారికి ఎలాంటి సమస్యలు లేకుండా చేయడం గురించి చర్చించారుతరువాత అన్నదానం వినాయక సదన్ రూము నందు సిబ్బంది కొరత కావడంతో పెంపు గురించి చర్చించారు, సిబ్బంది హెల్త్ ఇన్సూరెన్స్ లు, వార్షిక టెండర్లు గురించి చర్చించడం జరిగింది, మరియు లడ్డు పోటు లడ్డు నాణ్యత సరుకు నాణ్యత గురించి చర్చించడం జరిగింది, ఇంకా వివిధ ముఖ్య అంశాలపై సుదీర్ఘ చర్చలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు నాగరాజు నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శివ ప్రసాద్, సుబ్రహ్మణ్యం రెడ్డి, చంద్రకళ, అనసూయ, వసంత, సునీత, రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, పద్మలత, శ్రీవాణి ఏఈఓ లు ప్రసాద్, ఎస్వీ కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, ధనంజయ, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరింటెంట్లు కోదండపాణి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### రైల్వే కోడూరు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని

# ప్రారంభించిన జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు

● ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీసు సేవలు అందుబాటులోకి.



రైల్వే కోడూరు జూన్ 17మనం న్యూస్:తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మరింత సమర్థవంతమైన, వేగవంతమైన పోలీసు సేవలను అందించాలనే లక్ష్యంతో పుల్లంపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైల్వే కోడూరు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించి, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, పరిపాలనా విధానాలు, ప్రజలకు అందించనున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ, తిరుపతి జిల్లా పునర్విభజన అనంతరం రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని రెండు సర్కిల్ కార్యాలయాలు కూడా రైల్వే కోడూరు పట్టణంలోనే కొనసాగుతున్నాయని తెలిపారు. దీంతో రైల్వే కోడూరు రూరల్ ప్రాంతాలకు చెందిన ప్రజలు, ముఖ్యంగా పుల్లంపేట, పెనగలూరు, ఓబుళవారిపల్లి మండలాల ప్రజలు పిటిషన్లు, పరిపాలనా అవసరాల కోసం రైల్వే కోడూరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ప్రజల సౌకర్యార్థం పుల్లంపేట మండల కేంద్రంలో రైల్వే కోడూరు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యాలయంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో ఉండడంతో పాటు, సర్కిల్ పరిధిలోని పుల్లంపేట, పెనగలూరు, ఓబుళవారిపల్లి, చిట్వేల్ పోలీస్ స్టేషన్ల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఫలితంగా ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావడంతో పాటు, ఫిర్యాదుల స్వీకరణ, విచారణ, సమస్యల పరిష్కారం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన మరింత వేగవంతం అవుతుందని తెలిపారు.ముఖ్యంగా పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించడం తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం. పుల్లంపేటలో రైల్వే కోడూరు రూరల్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు ద్వారా ప్రజలకు సత్వర స్పందన, సమర్థవంతమైన పోలీసింగ్, మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి అని పేర్కొన్నారు.అలాగే, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి, చట్టపరమైన చర్యలు వేగంగా చేపడతామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్య ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించి సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి (శాంతిభద్రతలు), ఏ. శ్రీనివాసరావు (క్రైమ్స్), రేణిగుంట సబ్ డివిజన్ అధికారి శ్రీనివాస రావు ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, పుల్లంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కోడూరు టౌన్ సీఐ చంద్రశేఖర్, రేణిగుంట, గాజులమండ్యం సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## వరసిద్ధని ఆలయ నిత్య అన్నదానానికి,లక్ష విరాళం!

పూతలపట్టు జూన్ 17 మనం న్యూస్: శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థాన నిత్య అన్నదానకి విరాళం - 1,00,116రూపాయలు, దాత మురళీధర్ కుటుంబ సభ్యులు ఆలయ అధికారులకు చెక్కు ను అందించారు. మదనపల్లి వాస్తవ్యులు, వీరికి దర్శన ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ సూపర్డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు ఉన్నారు.

## చౌడేపల్లి శ్రీ మృత్యుంజయస్వర స్వామిసేవ టికెట్లపై అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో విచారణ



చౌడేపల్లి జూన్ 17 మనం: మండల కేంద్రమైన చౌడేపల్లిలోని శ్రీ అభీష్టత మృతుంజేశ్వర స్వామి ఆలయంలో సేవ టికెట్లపై నెలకొని ఉన్న సమస్యపై ఎండోమెంట్ అధికారులు విచారణ చేపట్టారు బుధవారం అన్నమయ్య జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయంలో సేవా టికెట్లు విక్రయించుకునేలా సంవత్సరం నుంచి కమిషనర్ నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు అయితే వీటి విషయంపై అర్చకులు రాష్ట్ర హైకోర్టు నందు రిట్ పిటిషన్ చేశారని ఇందులో భాగంగా నివేదిక సమర్పించేందుకై కోర్టు ఆదేశాల మేరకు తాను విచారణ చేపట్టినట్లు వివరించారు దేవాదాయశాఖ కమిషనర్ సేవా టికెట్లు విక్రయించక ముందు భక్తుల నుంచి సంబంధిత నగదు అర్చకుల వ్యక్తిగత ఖాతాలోకి జమ చేసేవారని ఇకపై అలా కాకుండా ఎండోమెంట్ అధికారులు ఇచ్చిన సేవా టికెట్లను విక్రయించి దేవాదాయ శాఖ అకౌంట్లో జమ చేయాలని అన్నారు జమ అయిన నగదును అర్చకులకు జీతాల రూపంలో అందిస్తామని అది సైతం కమిషనర్ ఆదేశాలు వచ్చిన తర్వాత ఉంటుందని ఆయన వివరించారు భూ సమస్యను పరిష్కరించి తమకు అందించాలని అప్పటివరకు సేవ టికెట్లు విక్రయించరాదని అర్చకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు ఈ మేరకు వినతి పత్రం అందించాలని అధికారులు అర్చకులకు సూచించారు అనంతరం పట్టణంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని ఆక్రమిత భూములను ఆయన సందర్శించారు గోసల కురపల్లిలో గల శివాలయం నూతన నిర్మాణానికి కృషి చేస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు శశికుమార్ గ్రూప్ టెంపుల్స్ ఈవో రమణ అర్చకులు స్థానికులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రతిభ ప్రశంస పత్రం ప్రధానం




బంగారుపాలెం జూన్ 17 మనం న్యూస్:బంగారు పాల్యం: పిచ్చుకల దినోత్సవం పురస్కరించుకొని ఇటీవల కాకినాడ అటవీ శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆన్లైన్ చిత్రలేఖన వ్యాసరచన పోటీల్లో బంగారు పాల్యం సెయింట్ మేరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న p. దక్షిణ్య, 3వ తరగతి చదువుతున్న p. ప్రద్యుతి ఉత్తమ ప్రతిభ కనబరచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ విజేతలకు ఉత్తమ ప్రశంసా పత్రాలను అందజేశారు. తమ పాఠశాలలో విద్యార్థులు అన్ని రంగాలలో రాణించే విధంగా తర్ఫీదు ఇస్తున్నామన్నారు.

## డిఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా దేవిరెడ్డి శంకర్ రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు

- దివ్యాంగుల సేవయే దేవిరెడ్డి కి విలువైన జన్మదిన కనుక
- వైయస్సార్సీపి నాయకులు విద్యానంద రెడ్డి.




స్నేహశీలి, సాత్వికుడు సమర్థుడు, కార్యదక్షుడు, సేవాతత్పరుడు, అనతికాలంలోనే పులివెందుల ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న ప్రజానాయకుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, ఆదేవుని చల్లని దీవెనలతో, అశేషమైన ప్రజల విశేష ఆశీస్సులతో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని, అన్నిరకాల విఘ్నాలు తొలగిపోయి ఆయన పులివెందుల ప్రజాక్షేత్రంలోకి, జనజీవనస్రవంతిలోకి అడుగుపెట్టే రోజు మరెంతో దూరంలో లేదని, అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరని, ప్రజాదరణ విస్తృతంగా ఉన్న నాయకులను ఎల్లకాలం జనాబాహుల్యానికి దూరంగా ఉంచలేరని ప్రముఖ వైఎస్ఆర్సిపి నాయకులు దొండ్లవాగు విద్యానందరెడ్డి పేర్కొన్నారు. సీనియర్ వైఎస్ఆర్సిపి నాయకులు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి 60వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సుజాత థియేటర్ సమీపంలో గల ఆయన స్వగృహంలో డిఎస్ఆర్ యువసేన అధ్యక్షులు అర్కటవేముల డేనియల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముందస్తు జన్మదినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విద్యానంద రెడ్డి , శంకర్ రెడ్డి సతీమణి దేవిరెడ్డి తులశమ్మ తదితరులు ఆయన జన్మదిన కట్ చేసి దివ్యాంగులకు అందించారు. అనంతరం డిఎస్ఆర్ యువసేన నాయకులు డేనియల్ సమకూర్చిన చీరలను 50 మంది మహిళా దివ్యాంగులకు, వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా డిఎస్ఆర్ యువసేన యూత్, దివ్యాంగులు దేవిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గ్యాస్, వంటనూనెల సురక్షిత వినియోగంపై శ్రీకాళహస్తిలో మహిళా మోర్చా అవగాహన సదస్సు




శ్రీకాళహస్తి, జూన్ 17,మనం న్యూస్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మహిళా మోర్చా ఆధ్వర్యంలో, చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో శ్రీకాళహస్తిలో మహిళలకు గ్యాస్, వంటనూనెల సురక్షిత వినియోగంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టిన "తక్కువ నూనె, మెరుగైన ఆరోగ్యం" కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ సదస్సుకు బీజేపీ తిరుపతి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రజ్ఞశ్రీ, దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితులు చాగణం శైలజ, కోస్టల్ జోన్ ఇంచార్జ్ పి.వి.ఎస్. లక్ష్మీప్రియ, దేవి వెంకట్, అంకమ్మ, ఉమాసింగ్ మరియు ట్రస్ట్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, వంటగదిలో తీసుకునే చిన్న చిన్న జాగ్రత్తలు కుటుంబ ఆరోగ్యంతో పాటు దేశ ప్రగతికి దోహదపడతాయని పేర్కొన్నారు.



## తిమ్మోజిపల్లి గ్రామంలో యూరియా బిపిపి సరఫరా విధానం అవగాహన సదస్సు

- ఏపీ ఏఐఎంఎస్ ఏపిపి ద్వారా వెరిఫై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు..

బంగారుపాళ్యం జూన్ 17 మనం న్యూస్. మండలంలోని చిమ్మేజి పల్లి గ్రామపంచాయతీ పరిధిలో రైతులకు ఏరియా. డి ఏ పి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం చిత్తూరు వ్యవసాయ అధికారి కి మురళి మాట్లాడుతూ పంట పండించే ప్రతి రైతుకు ఏరియా డీఏపీలు సరఫరా చేసే విధంగా ప్రభుత్వం ముందుందని అన్నారు. బంగారుపాలి మండలంలోని రైతుల కోసం ఏరియా. డి ఏ పి లుఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి గారు పాల్గొని, రైతులు ఏ పి ఏ ఐ ఎం ఎస్ ఏపీపీద్వారా యూరియా సరఫరా విధానం ద్వారా పంట పడించిన ప్రతి రైతుకు సరిపడా యూరియా మరియు బి ఏ పిలబ్ది చేకూరుతుందని వివరించారు, ఈ ఏ పి పి.ద్వారా సరఫరా చేయడం రైతులకు చాలా ప్రయోజనం చేకూరుతుంది అని వివరించారు.ఏపీపీలో ప్రతి రైతు యొక్క పంట వివరాలు పరిశీలించి, పంటకు కావాల్సిన ఎరువులు జిల్లా లో ఎక్కడైనా తీసుకోవచ్చు అని తెలిపారు.రైతుల కు యూరియా కొరత లేదని అన్ని రైతులు సేవ కేంద్రంలో యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు, ఏ పి పి ద్వారా రైతుకి సరిపడా యూరియా పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమం లో చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి ఉమా, వ్యవసాయ అధికారి, ఆర్ ఎస్ కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



పూతలపట్టు జూన్ 17 మనం న్యూస్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని స్కూటర్లు ప్రయాణిస్తున్న వ్యక్తినీ తీవ్ర గాయాలయింది. స్థానికుల సమాచారం మేరకు బుధవారంగాండ్లపల్లి తిరుపతి బైపాస్ రోడ్డు నుంచి తిరుపతి వైపు స్కూటర్లో వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలు అయింది అతన్ని స్థానికులు 108 ద్వారా కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి ప్రకటించారు

## తిరుమలలో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసుల అవగాహన సమావేశం.

- ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి.
- భక్తుల భద్రత దృష్ట్యా ఇన్నర్ రింగ్ రోడ్డులో ట్రాక్టర్ల రాకపోకలకు పరిమితులు
- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన చర్యలు.



తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు తిరుమల ట్రాఫిక్ పోలీసులు ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ అధికారులు మాట్లాడుతూ, తిరుమలలో నడిచే ప్రతి ట్రాక్టర్‌కు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అలాగే వాహనాలను నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు.తిరుమలలో రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలను నివారించడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం లక్ష్యంగా ట్రాక్టర్లు వీలైనంత వరకు ఇన్నర్ రింగ్ రోడ్డులోకి ప్రవేశించకుండా, ఔటర్ రింగ్ రోడ్డును మాత్రమే వినియోగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు మినహా భక్తులు అధికంగా సంచరించే ప్రాంతాల్లో ట్రాక్టర్ల రాకపోకలను తగ్గించాలని పేర్కొన్నారు.అదేవిధంగా ట్రాక్టర్లలో అధిక లోడుతో ప్రయాణించరాదని, వాహనాల నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలని, బ్రేకులు, లైట్లు, ఇండికేటర్లు వంటి భద్రతా పరికరాలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని సూచించారు.వాహనాలను నిర్లక్ష్యంగా లేదా అతివేగంగా నడపకుండా రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ సేవలపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత




చిత్తూరు, జూన్ 17 మనం న్యూస్:బాలల హక్కులు, సంక్షేమం కోసం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పనిచేస్తుందని కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత పేర్కొన్నారు, చిత్తూరు జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా కమిషన్ సభ్యురాలు బుధవారం చిత్తూరు పట్టణంలో పర్యటించి పలు ప్రభుత్వ, సంక్షేమ, ఆరోగ్య సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి, స్కానింగ్ కేంద్రాలు, శిశు గృహం, వన్ స్టాప్ సెంటర్, ఆనంద నిలయం, ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లలో అందుతున్న సేవలను పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాలలు, మహిళలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో బాలల సంక్షేమం, ఆరోగ్య సేవలు, సంరక్షణ కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన ఆమె, విద్యార్థినులకు అందుతున్న విద్యా, వసతి మరియు ఇతర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థినులతో ముచ్చటిస్తూ, వారిలో అవగాహన పెంపొందించేందుకు కమిషన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ప్రతి బాలుడి, బాలికలో ఉన్న ప్రతిభను గుర్తించి వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించడం సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. పిల్లల అవసరాలు, వారికి ప్రభుత్వం ద్వారా అందవలసిన హక్కులు చేరేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిజాయితీ, క్రమశిక్షణతో జీవిస్తూ, ఇతరుల మనోభావాలను గౌరవిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.ఇంటర్నెట్ వినియోగాన్ని సద్వినియోగం చేసుకుని, మంచి మార్గంలో జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈనాటి బాలలే రేపటి భవిష్యత్ తరానికి అమూల్యమైన ఆస్తి అని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో. డి వెంకటేశ్వరి పిడి ఐసిడిఎస్, నిర్మల జిల్లా మిషన్ కోఆర్డినేటర్, సుబ్రహ్మణ్యం జిల్లా బాలల సంరక్షణ అధికారి, సంబంధిత శాఖల అధికారులు, సంస్థల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యోగతో శారీరక ఆరోగ్యం -మానసిక ప్రశాంతత

- టిటిడి జేఈవో డా. ఎ. శరత్



తిరుపతి(టిటిడి),జూన్ 17,మనం న్యూస్:ప్రతిరోజూ యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందుతాయని టిటిడి జేఈవో డా. ఎ. శరత్ తెలిపారు. "యోగ–టిటిడి ఆరోగ్యానంద" కార్యక్రమంలో భాగంగా తిరుపతిలోని ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న యోగ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా టిటిడి ఈవో ఎం. రవిచంద్ర ఆదేశాల మేరకు టిటిడి ఉద్యోగులకు ఈ నెల 7 నుండి 21వ తేదీ వరకు 15 రోజుల యోగ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మనస్ఫూర్తిగా యోగాభ్యాసం చేస్తే ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబ జీవితంలో ఆనందం, సౌఖ్యం నెలకొంటాయని చెప్పారు. శిక్షణలో పాల్గొంటున్న ఉద్యోగులు ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగే యోగ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టిటిడి వెల్ఫేర్ డిప్యూటీ ఈవో ఆనందరావు, ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. నారాయణమ్మ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మీ ఆధరాభిమానాలు మరువలేనివి!

- జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ గా భరత్ కుమార్ రెడ్డి నూతన బాధ్యతలు
- లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలంటూ వెల్లడి



చిన్నగొట్టిగల్లు జూన్ 17మనం న్యూస్మీ: రు నాపై చూపెడుతున్న ఆధరాభిమానాలు మరువలేనివని తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ భరత్ కుమార్ రెడ్డి సిబ్బందిని ఉద్దేశించి అన్నారు.బుధవారం తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గా నూతన బాధ్యతలు చేపట్టిన భరత్ కుమార్ రెడ్డి ని సిబ్బంది మర్యాద పూర్వకంగా కలసి శాలువాలు కప్పి పుష్ప గుచ్చాలతో ఘనంగా సన్మానించి తమ అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమిష్టి కృషితో లక్ష్య సాధనలో భాగస్వామ్యులవుదామని కోరారు.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష స్టేట్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు శివకుమార్ , స్టేట్ యూనియన్ జనరల్ సెక్రటరీ పాటూరి రవి , తిరుపతి జిల్లా యూనియన్ అధ్యక్షులు ఇకుట్టి మునిరత్నం , జిల్లాయూనియన్ ప్రధాన కార్యదర్శి కె వి ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ పుత్తూరు సుబ్రమణ్యం, ట్రెజరర్ బిన్ కండ్రిగ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్లలో సంతృప్తికరంగా ఆహార పదార్థాలు అందించండి.

- కమిషనర్ (ఎఫ్.ఏ.సి)శారదా దేవి .



నగరంలోని అన్నా క్యాంటీన్లలో ప్రజలకు సంతృప్తికరంగా ఆహార పదార్థాలు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని న్యూ బాలాజీ కాలనీ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం తింటున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నా కాంటీన్లకు వచ్చే ప్రజలకు సరిపడినంత ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. అన్నం వృధా చేయకుండా తగినంత తీసుకోవాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే ఇవ్వాలని సూచించారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు. అన్నా కాంటీన్లలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పక్కనే ఉన్న చెత్త నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇంటింటి నుండి ఎంత చెత్త తీసుకువస్తున్నారు, తూకివాకం చెత్త నిర్వహణ కేంద్రానికి ఎంత తరలిస్తున్నారనేది పక్కగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ రమణ, ఏసిపి పార్వతిప్రియ, సర్వేయర్ గురువారెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

## ఆటో డ్రైవర్లతో జన విశ్వాస కార్యక్రమం



శాంతిపురం మండలం జూన్ 17 మనం న్యూస్ చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఆదేశాల మేరకు,కుప్పం సబ్ డివిజన్ ఎస్డిపిఓ బి.పార్థసారథి సూచనలతో, రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఐ. నరేష్ ఆధ్వర్యంలో బుధవారం శాంతిపురం మండలంలోని ఆటో డ్రైవర్లతో "జన విశ్వాస"కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా రాళ్ళబూదుగూరు ఎస్సై ఐ.నరేష్ ఆటో డ్రైవర్ల వాహనాల పత్రాలను పరిశీలించి,రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం,మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల సంభవించే ప్రమాదాల గురించి వివరించారు.రాత్రి వేళల్లో వాహనాలు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా రాళ్ళబూదుగూరు ఎస్సై ఐ.నరేష్ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయి మరియు ఇతర అక్రమ వస్తువుల రవాణాకు సహకరించరాదని హెచ్చరించారు. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,ముఖ్యంగా మహిళల పట్ల గౌరవప్రదంగా ప్రవర్తించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలను మాత్రమే వసూలు చేయాలని ఆటో డ్రైవర్లకు తెలియజేశారు.ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు పోలీసు-ప్రజల మధ్య పరస్పర విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే జన విశ్వాస కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని రాళ్ళబూదుగూరు ఎస్ఐ తెలిపారు.

## సర్‌ఓటర్ల మ్యాపింగ్పై వైసీపీ బి ఎల్ ఏలు అప్రమత్తంగా ఉండాలి--!

● పూతలపట్టు మండల వైసీపీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి

పూతలపట్టు జూన్ 17 మనం న్యూస్: సర్ ఓటర్ల మ్యాపింగ్ పై వైసీపీ బీఎల్ ఏలు అప్రమత్తంగా ఉండాలని పూతలపట్టు వైసిపి మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి బుధవారం విలేకరులు తెలియజేశారు. రెవెన్యూ శాఖ సర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల పై నమోదు చేసుకుంటున్నారని వాటిలో తప్పులు లేకుండా మనం తప్పనిసరిగా దగ్గరుండి వైసిపి పార్టీ ఓట్లను తీయనీయకుండా అప్రమత్తంగా ఉండాలనిఆయన అన్నారు .ప్రభుత్వం రాష్ట్రంలో వైసీపీ ఓటర్లను తొలగించడం కొరకే ఈ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. అందువలన గురువారం సాయంత్రం పూతలపట్టు మండలం కొత్తకోట వెంకటేశ్వర కళ్యాణ మండపము నందు 4:30 నిమిషాలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పూతలపట్టు వైసిపిమండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు .ఈ కార్యక్రమంలో సర్ ప్రక్రియ, పురోగతి, క్షేత్ర స్థాయి పరిస్థితులు,పార్టీ శ్రేణులు భాగస్వామిపై చర్చిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికిపూతలపట్టు మండలం వైస్సార్సీపీ నాయకులకి, కార్యకర్తలకి, కొత్తగా నియమించబడిన బి. ఎల్. ఎ.లు గురువారం సాయంత్రం 4:30 గంటలకి పి. కొత్తకోట లోని శ వెంకటేశ్వరస్వామి కళ్యాణమండపం నందు మీటింగ్ నిర్వహించడం జరుగుతుంది. అందువలన క ప్రతి బి .ఎల్ .ఏ .లు మండల వైసీపీ నాయకులు తప్పక ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

## గంగమ్మ....చల్లగా చూడమ్మా

● గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

● సి రామాపురంలో వైభవంగా గంగజాతర.



రామచంద్రపురం: గంగమ్మ నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడమ్మా అంటూ సి రామాపురంలో గంగ జాతర సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ ( నాని) గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించినందుకు విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నానికి స్థానిక కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలను మండల వాయిద్యాలు, డప్పులు, బాణాసంచాలు పేలుస్తూ ఊరేగింపుకో అమ్మవారి గుడి వద్దకు తీసుకెళ్లి సారె సమర్పించారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు ఎమ్మెల్యే పులివర్తి నానికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి, శాలువులతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, ఉమాపతి నాయుడు మాజీ ఎంపీపీ తానికొండ కేశవులు నాయుడు, కే నరసింహారెడ్డి, కే ధనంజయ రెడ్డి, ముని రాంరెడ్డి, ఎంపిటిసి చంద్రశేఖర్ రెడ్డి, కే గిరిధర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రంజిత్ కుమార్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, సి రవికుమార్, హరి ప్రసాద్, సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 20న చితూరు జిల్లాకు వెనుకబడిన తరగతుల కమిషన్ రాక

● జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు జూన్17 మనం న్యూస్:రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి అంకితభావ కమిషన్”ఈనెల 20న శనివారం చిత్తూరు జిల్లాలోరాజీవ్ రంజన్ మిశ్రా బృందం పర్యటించనున్నారు.అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లపై పిటిషన్లు, వినతులు సమర్పించడానికి బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజల ప్రజల నుంచి వినతలు స్వీకరిస్తారు. కలెక్టరేట్ లోని పి.జి.ఆర్.ఎస్ హాల్లో ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు బహిరంగ విచారణ.గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతులకు కల్పించాల్సిన రిజర్వేషన్ల నిష్పత్తిని శాస్త్రీయంగా మరియు సమగ్రంగా నిర్ధారించేందుకు ఈ కమిషన్ పనిచేస్తుందని ప్రకటనలో తెలిపారు.ఈ కమిషన్, జిల్లాలోని వెనుకబడినతరగతుల సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ వెనుకబాటుతనంపై క్షేత్రస్థాయి పరిశీలన జరపనుంది.ఈ పర్యటనలో భాగంగా, 20వతేది శనివారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటలవరకు చిత్తూరు జిల్లా కలెక్టరేట్ సముదాయంలోని పి.జి.ఆర్.ఎస్ హాల్ నందు బహిరంగ సభ మరియు ముఖాముఖికార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ నిర్ణీత సమయం మరియు వేదిక వద్ద జిల్లాలోని వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు సాధారణ ప్రజలు కమిషనన్ను నేరుగా కలిసి తమ అభ్యర్ధనలు, సలహాలు,మరియు లిఖితపూర్వక వినతిపత్రాలను సమర్పించవచ్చు. ఆయా వినతులను స్వీకరించి, రశీదులు. ఇచ్చేందుకు వేదిక వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగింది. బీసీ వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారు.

## గంగమ్మ ను దర్శించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం



శ్రీకాళహస్తి జూన్ 17 మనం న్యూస్: శ్రీకాళహస్తి మండలంలోని నారాయణపురం గ్రామంలో బుధవారం అంగరంగ వైభోగంగా గంగమ్మ జాతరను గ్రామస్తులు నిర్వహించారు అందులో భాగంగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం బుధవారం గంగమ్మను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడాలని రైతులు, పాడి రైతులు ప్రజలు అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని మొక్కుకున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రత్నం రెడ్డి భరత్ కుమార్ రెడ్డి వసంత రామ్ రెడ్డి ముని కుమార్ రెడ్డి ఆదిరెడ్డి మునిరాం రెడ్డి కేశవరెడ్డి పరంధామ రెడ్డి కుమార్ వైయస్సార్సీపి పట్టణ యువజన అధ్యక్షులు మల్లెంబాకంముని కృష్ణారెడ్డి చింతకాయల సుధాకర్ రెడ్డి భక్త ఉత్సవాల రెడ్డి తదితర వైకాపా నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

# “పవిత్రతను” మంట కలపకండి!

### తిరుపతిలోని రాజకీయ పార్టీల నాయకులకు నవీన్ విజ్ఞప్తి

తిరుపతి నగరపాలక సంస్థ అధికారుల నిరంతర పర్యవేక్షణ లోపం నగర ప్రజలకు శాపంగా, ప్రాణాంతకంగా మారింది,తిరుపతి నగర ప్రజల ప్రాణాలతో చెలగాటమాడకండి!తిరుపతిలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న హోటల్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లపై నిరంతరం నిఘా లేకపోవడం నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ,@వెటర్నరీ డాక్టర్,ఫుడ్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట!తిరుపతి జిల్లాకు కేవలం 2 ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రమే ఉన్నారు,సిబ్బంది కొరత ఉంది,వీరి బాధ్యత కల్తీ వస్తువులు ఎక్స్పైరీ డేట్ వస్తువులు అమ్మకుండా చూడటం మాత్రమే! నగరంలోని మటన్ చికెన్ స్టాల్స్ పర్యవేక్షించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థలోని వెటర్నరీ డాక్టర్ పారిశుధ్య అధికారులదే!తిరుపతి నగరంలో కుళ్ళిన మాంసం గుట్టురట్టు కావడంతో నగర ప్రజలతో పాటు తిరుపతితో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరు ఉలిక్కి పడ్డారన్నారు!తిరుపతిలోని రాజకీయ పార్టీల నాయకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ తిరుపతి పరపతిని సోషల్ మీడియా వేదికగా మంట కలుపుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు! తిరుపతిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారి వివరాలు ఏ రాజకీయ పార్టీ నాయకుల వద్ద ఉన్నా వెంటనే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు సహకరించాలే తప్ప వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఒక సంఘటనను బూచిగా చూపించి తిరుపతిలో కోట్లాది రూపాయలు వెచ్చించి తమ స్తోమతను పట్టి హోటల్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి కడుపు కొట్టడం మంచిది కాదన్నారుతిరుపతి రాజకీయాలు “కుళ్లి” పోయాయని,కుళ్ళిన మాంసం కన్నా తిరుపతి రాజకీయ నాయకుల మాటలు ప్రమాదకరంగా మారాయన్నారు! తిరుపతిలో బయటపడిన కుళ్ళిన మాంసంతో కుటిల రాజకీయాలు చేస్తున్న తిరుపతి రాజకీయ రాబందులు ఓసారి ఆత్మ విమర్శ చేసుకొనితిరుపతి పవిత్రతను కాపాడాలే తప్ప,అందరూ కలసి మంట కలపకండి అని విజ్ఞప్తి చేశారుతిరుపతిలో బయటపడిన కుళ్ళిన మాంసం పై నగర ప్రజల ఆందోళనలో ఉన్నారని జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ప్రజల ప్రాణాలకు హాని జరగకుండా,ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారుతిరుపతిలో కుళ్ళిన మాంసం దొరికి రోజులు గడుస్తున్నా,జరిగిన ఒక సంఘటనను ప్రతి రోజూ ఈ పార్టీ ఆ పార్టీ నాయకులు పదేపదే మాట్లాడుతూ తెలియని వారికి కూడా సోషల్ మీడియాలో షేర్ చేసి మరీ తిరుపతి పవిత్రతను దెబ్బ తీస్తున్నారని నవీన్ ఆవేదన వ్యక్తం చేశారుమీడియా సోషల్ మీడియా ద్వారా చూసి బయట ఊర్లో ఉన్న స్నేహితులు బంధువులు ఫోన్ లు చేసి మరీ అడుగుతున్నారు, తిరుపతిని రాజకీయ ప్రయోజనాల కోసం ఎందుకు అలా భ్రష్టు పట్టిచ్చేస్ తున్నారనిబాధపడుతున్నారన్నారుజిల్లా కలెక్టర్ గారు ఎస్పీ గారు నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్,ఫుడ్ సేఫ్టీ అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారులు వెంటనే కుళ్ళిన మాంసం అంశానికి సంబంధించి కఠిన నిర్ణయం తీసుకొని దోషులను శిక్షించాలని, మేకలను కట్ చేసే స్థలాన్ని నగర నడిబొడ్డున కాకుండా,నగరానికి దూరంగా చేసుకునేలా ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని నవీన్ కుమార్ రెడ్డ విజ్ఞప్తి చేశారు

# ఏపీఎస్పీడీసీఎల్ గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్ ఆకస్మిక తనిఖీ

● విద్యుత్ పరికరాల నిర్వహణ కీలకం

● స్మార్ట్ స్టోర్ గా గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్

● సిఎండి శివశంకర్ లోతేటి



తిరుపతి/నెల్లూరు, జూన్ 17:ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని గోదాముల్లో విద్యుత్ పరికరాల నిర్వహణ కీలకమని ఆ సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. నెల్లూరు సర్కిల్ పరిధిలోని గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్, ట్రాన్స్ఫార్మర్ రిపేర్ షెడ్ లను సిఎండి శివ శంకర్ లోతేటి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఎండి మాట్లాడుతూ స్టోర్స్ లో విద్యుత్ పరికరాల నిర్వహణను క్రమ పద్ధతిలో చేపడుతూ, వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన మెటీరియల్ ను సకాలంలో అందించాల్సిన బాధ్యత స్టోర్స్ అధికారులపై ఉంటుందని తెలిపారు. గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్ ను స్మార్ట్ స్టోర్ గా రూపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మెటీరియల్ నిర్వహణలో అలసత్వం, అక్రమాలు చోటు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే సంబంధిత అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్టోర్ లోని ఏ బి కేబుల్, ట్రాన్స్ఫార్మర్లు, ఇన్సులేటర్స్, బ్రేకర్స్, క్యూబికల్స్, ఎర్త్ పైప్స్, కండక్టర్ తదితర పరికరాలను పరిశీలించి, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టోర్స్ నుంచి ఇన్కమింగ్, అవుట్ గోయింగ్ రిజిస్టర్ను పక్కాగా నిర్వహించాలని సూచించారు. పరికరాలు నిరుపయోగం కాకుండా వాటిని క్రమ పద్ధతిలో వినియోగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**టెండర్ ప్రక్రియ ద్వారా పాత పరికరాల విక్రయం**

స్టోర్స్ లో ఉన్న వివిధ పాత పరికరాలను టెండరు ప్రక్రియ ద్వారా ఎప్పటికప్పుడు విక్రయించేందుకు చర్యలు చేపట్టాలని సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. అదేవిధంగా పరికరాల నిర్వహణకు రెండు నెలల్లోగా ప్లాట్ ఫామ్ ను నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక స్టోర్స్ లో పనిచేస్తున్న కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వారికి మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం గూడూరు డివిజనల్ కార్యాలయంలో అధికారులతో వివిధ అంశాలపై సమీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్ & హెచ్ఆర్డి) కే. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్. రమణ, సూపరింటెండింగ్ ఇంజనీర్లు డి. తిరుమలరావు, వి. చంద్రశేఖర రావు, కే. రాఘవేంద్రం, జనరల్ మేనేజర్లు పివి సుబ్బారావు, సిహెచ్ నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాల చంద్రబాబు, నరేంద్ర, శ్రీధర్, లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చెత్త ఎత్తేదెవరు?.. పట్టణాన్ని పట్టిపీడిస్తున్న పారిశుద్ధ్య సమస




పుత్తూరు: జూన్, 17, మనం న్యూస్:పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. నివాస ప్రాంతాల సమీపంలో, కాలువల్లో, అంగడి మరియు ఇళ్ల ముందర చెత్తను వేయడం పరిపాటిగా మారింది. చెత్త బండి లేదా పారిశుద్ధ్య సిబ్బంది వచ్చి తొలగించే వరకు చెత్త కుప్పలు అలాగే ఉండిపోతున్నాయి.మండి వీధిలో కనిపిస్తున్న చెత్త దృశ్యాలు పట్టణ పారిశుద్ధ్య నిర్వహణకు అద్దం పడుతున్నాయి. నిత్యం ప్రజలు, వ్యాపారులు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో చెత్త పేరుకుపోవడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈలోగా గాలికి చెత్త చెల్లాచెదురై వీధులన్నీ మురికిగా మారుతున్నాయి. కుక్కలు, ఆవులు చెత్త కుప్పలను చెదరగొట్టడంతో పరిస్థితి మరింత దయనీయంగా తయారవుతోంది. దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా కాలువల్లో చెత్త వేయడం వల్ల మురుగునీటి ప్రవాహం నిలిచిపోయి వర్షాకాలంలో నీరు నిలిచే ప్రమాదం ఉందని ప్రజలు చెబుతున్నారు. పట్టణంలోని అనేక వార్డుల్లో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు పేర్కొంటున్నారు.పారిశుద్ధ్య నిర్వహణలో మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని చెత్త సేకరణను క్రమబద్ధీకరించాలని, కాలువల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. స్వచ్ఛ పట్టణం నినాదం కేవలం బోర్డులకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## అటహాసంగా ఇవిరా గ్లోబల్ ప్రీ-స్కూల్ ప్రారంభోత్సవం

● ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, పులివర్తి నాని, డా. కలికిరి మురళి మోహన్,



తిరుపతి రూరల్ మండలం, వేదాంతపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇవిరా గ్లోబల్ ప్రీ-స్కూల్ ప్రారంభోత్సవం అటహాసంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే డా. కలికిరి మురళి మోహన్, టిటిడి పాలకమండలి సభ్యులు జి భాను ప్రకాష్ రెడ్డి, టిడిపి నాయకులు మబ్బు దేవ నారాయణ రెడ్డి, జి నరసింహ యాదవులు, ముఖ్య అతిథులకు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థను ప్రారంభించిన ఎమ్మెల్యేలు, పాఠశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులకు నాణ్యమైన, అత్యుత్తమ విద్యా ప్రమాణాలను అందిస్తూ ఈ ప్రీ-స్కూల్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవ నాయుడు, పాఠశాల కరస్పాండెంట్ తానుకొండ జగదీష్, ఈశ్వర్ రెడ్డి, చిరంజీవి రెడ్డి, గణపతి నాయుడు, ఆల్మినేని మధు, ఎం తిరుమలరెడ్డి, కోరా హరిప్రసాద్, భూపతి నాయుడు, బాదురు ధనుంజయులు, మాదాసు మాధవయ్య, లెక్కల సురేందర్ నాయుడు, మహేష్ నాయుడు, జ్ఞాన సాయి కూటమి నాయకులు పాల్గొన్నారు.




## రెండేళ్లలో నమ్మకం- సంక్షేమం- అభివృద్ధికి చిరునామాగా చంద్రన్న ప్రభుత్వం

● టిడిపి జిల్లా అధ్యక్షురాలు పనపాక లక్ష్మి, కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి

● అట్టహాసంగా విజయోత్సవ సభ

పిచ్చాటూరు జూన్ 17 మనం న్యూస్ :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా పిచ్చాటూరు టీచర్స్ కాలనీ లోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన విజయోత్సవ సభ అత్యంత ఘనంగా జరిగింది. సమావేశానికి ముఖ్య అతిదులు గా హాజరైన టిడిపి తిరుపతి జిల్లా అధ్యక్షురాలు పనపాక లక్ష్మి, నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి లు సంయుక్తంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన లో నమ్మకం, సంక్షేమం, అభివృద్ధి కి చంద్రన్న ప్రభుత్వం చిరునామాగా మారిందన్నారు.2024లో ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుకు బాధ్యతగా స్వీకరించి సీఎం చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ త్రయం ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్ర పునర్నిర్మాణానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందుకు నిదర్శనం ఈ విజయోత్సవ సభకు వేలాదిగా తరలివచ్చిన మహిళలు, రైతులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధుల ప్రజా వెల్లువేనన్నారు. సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి కోసం రెండేళ్లలో 500 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. సత్యవేడును చంద్రబాబు నాయుడు చొరవతో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దడమే మా లక్ష్యమన్నారు. జగన్ రెడ్డి లాంటి అరాచకశక్తి మళ్లీ అధికారంలోకి రాకూడదన్నారు. మరో 20 ఏళ్లు కూటమి ప్రభుత్వం కొనసాగడం ఖాయమనీ ధీమా వ్యక్తపరిచారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు శివ కృష్ణమ నాయుడు, మునస్వామి యాదవ్, గిరిబాబు, ప్రణీత్ రెడ్డి, శివకుమార్, పల్లి కొండేశ్వర ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పద్మనాభ రాజు, సింగల్ విండో చైర్మన్ లు సోంపల్లి. జయచంద్ర నాయుడు,, ప్రకాష్ నాయుడు, ఏఎంసీ చైర్మన్ దామోదర జాన్సన్ నాయకులు బాలరాజు, రమేష్, రవి, చిన్న, కృష్ణయ్య, భాష, కన్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు

**ఘన స్వాగతం -భారీ ఏర్పాట్లు**

అంతకుముందు కూరపాటి శంకర్ రెడ్డి కి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. చెక్పోస్ట్ సర్కిల్ మీదుగా టీచర్స్ కాలనీ కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచాలు కాలుస్తూ డ్రమ్స్ వాయిద్యాలతో స్వాగతించారు.

## హోంగార్డులను ఘనంగా సన్మానించిన దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్



శ్రీకాళహస్తి,జూన్ 17,మనం న్యూస్: మౌలిక సదుపాయాలు, ఆలయ పరిసరాల పరిశుభ్రత, భక్తుల సౌకర్యాల కల్పనలో శ్రీకాళహస్తి దేవస్థానం రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా ఆలయ హోంగార్డులను దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ఘనంగా సన్మానించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవస్థానం సాధించిన ఈ విశిష్ట విజయానికి తమ వంతు నిరంతర సేవలు అందించి, ఆలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన హోంగార్డుల సేవలను చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ భద్రతలో, భక్తుల నియంత్రణలో వారు చూపుతున్న ప్రతిభను కొనియాడుతూ వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది మరియు హోంగార్డులు పాల్గొన్నారు.